సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 7 । జులై । 2025



రూ.50 వేల విరాళం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారికి గూడవల్లి మహాలక్ష్మి కుటుంబ సభ్యులు (ఆత్రేయపురం మండలం రాజవరం) రూ.50 వేల విరాళం సమర్పించారు.



నూకాంబికా ఆలయానికి రూ.లక్ష

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయానికి సత్యలక్ష్మి రైస్ మిల్స్ అధినేత వెత్సా గవర్రాజు, భాగస్వాములు (ఆలమూరు) రూ.1,00,116 విరాళం సమర్పించారు.

వెజిట్రబుల్స్



ఏం కొంటాం.. ఏం తింటాం.. అనేటట్లుంది కూరగాయల పరిస్థితి. వీటి ధర అంతకంతకూ పెరుగుతోంది. ఉల్లిని కొంటేనే కన్నీరు వస్తోంది. పచ్చిమిర్చికి ఘాటు ఎక్కువైంది. వాతావరణ మార్పులు, దిగుబడి తగ్గడంతో కూరగాయల ధర రోజురోజుకూ పెరిగిపోతుంది.

8లో

న్యూస్‌రీల్

కామాక్షీ అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ



కామాక్షీ పీఠంలో అమ్మవారి సన్నిధిలో ఆషాఢం సారెను సమర్పిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినాన అమలాపురం శ్రీకామాక్షీ పీఠంలోని అమ్మవారికి మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. పీఠానికి తరచూ వచ్చే మహిళలు ఆషాఢం సారెతో పాటు దాదాపు రూ.లక్ష విలువైన 10 గ్రాముల బంగారు మంగళ సూత్రాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని పలు వీధుల నుంచి మహిళలు చీర సారెతోపాటు బంగారు మంగళ సూత్రాలు, పలు రకాల మిఠాయిలతో పీఠానికి ప్రదర్శనగా వచ్చారు. పీఠం బ్రహ్మ గోవిందవజ్జుల నాగబాబు బ్రహ్మత్వంలో ఉత్తరాధికారి విఘునస రాఖీప్రేమ్ తొలుత కామాక్షీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, పీఠంలోని ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, ట్రస్ట్ సభ్యులు వీరా నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ, పీఠం మేనేజర్ మద్రి దుర్గారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి దంపతులు, కామనగరువు సర్పంచ్ దాసరి అరుణకుమారి దంపతులు పాల్గొన్నారు. మహిళలు సరిపెల్ల అనంతలక్ష్మి, విజయకుమారి, బాలిరెడ్డి రాధిక, వెత్సా రత్నరాధిక తదితరులు కార్యక్రమం విజయవంతానికి కృషి చేశారు.

9 నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రవాణా వాహనాలు, మోటార్ వాహనాల తనిఖీ అధికారులచే జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఈ నెల 9 నుంచి ఎ.వేమవరంలో ఏర్పాటైన ఏటీఎస్ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వారా జారీ చేస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక ఫిట్‌నెస్ స్లాట్లు అన్ని ఏటీఎస్‌కు బుక్ అవుతాయని, దీనికోసం సాఫ్ట్‌వేర్‌లో సవరణలు చేశారన్నారు. వాహనదారులు, అదేవిధంగా ఆటో, లారీ ఓనర్స్ యూనియన్లు గమనించి ఏటీఎస్ ద్వారా వాహనాల సామర్థ్య పరీక్షలు చేయించుకుని, ధ్రువీకరణ పత్రాలు పొందాలని ఆయన కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. 1100 కాల్ సెంటర్‌కు అర్జీదారులు ఫోన్ చేసి తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే అడగవచ్చన్నారు. కొత్త ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. అలాగే ప్రజల సౌకర్యార్థం మూడు రెవెన్యూ డివిజన్లలోని 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాల్లో ఈ గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. అర్జీదారులు ఆయా స్థాయిల్లో తమ సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారం పొందాలన్నారు.

నిండా ముంచేలా..

- ఖరీఫ్‌కు ఆదిలోనే హంసపాదు
- కొద్దిపాటి వర్షానికే మునిగిన పొలాలు
- రూ.2.30 కోట్లతో సైఫన్ నిర్మించిన చోటే ముంపు
- సాగుకు వెనకడుగు వేస్తున్న రైతన్నలు



ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెంలో చెరువును తలపిస్తున్న వరి చేను

సాక్షి, అమలాపురం: కష్టాలు కొన'సాగుతున్నాయి'.. పుడమిపుత్రులను నిండా ముంచుతున్నాయి.. తొలకరి సాగును పూర్తిగా దూరం చేశాయి.. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో తుపాన్లు, భారీ వర్షాలకు కోతకు వచ్చిన వరి చేలు నీట మునగడం పరిపాటి. కానీ ఇప్పుడు జూలైలో కురుస్తున్న కొద్దిపాటి వర్షానికే ఆకుమడులు నీట మునగడం చూసి రైతులు నిర్ఘాంత పోతున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, సఖినేటిపల్లి, మలికిపురం వంటి శివారుల్లో చేలు ముంపుబారిన పడడం అనేది గతం... ఇప్పుడు ఆత్రేయపురం వంటి మెరక ప్రాంతాల్లో కూడా చేలు ముంపునీట ఉంటున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు సాగు భరోసా లేకుండా పోయింది. అన్నదాత సుఖీభవ సొమ్ము తొలి ఏడాది లేదు.. రెండో ఏడాది ఆ ఊసేలేదు.. నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ములు లేవు.. ఉచిత బీమాను ఎత్తేశారు. అసలు బీమా పరిహారం ఇస్తారనే నమ్మకం రైతులకు కలగడం లేదు. ఇలా జిల్లాలోని ఆయకట్టు రైతుకు సాగు చేసే ధైర్యం లేక తొలకరి పంటను వదిలేస్తున్నారు. దీనిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్టు ఇది.

చెరువులు కాదు... చేలు

తామరాకులు, కలువ పువ్వులతో అందంగా కనిపిస్తున్నది చెరువు అనుకున్నారో.. తప్పులో కాలేసినట్టే. ఇది వరి చేను. ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెంలో తొలకరి సాగు చేయాల్సిన చేలల్లో ముంపునీరు వీడక ఇలా చెరువుల్లా మారిపోయాయి. నైరుతి వచ్చిన తరువాత సరైన వర్షం లేకపోయినా చేలల్లో రెండు, మూడు అడుగుల ఎత్తున నీరు చేరింది. ముంపునకు భయపడి ఏటా ఇక్కడ తొలకరి సాగును రైతులు వదిలేస్తున్నారు. ఈ ఏడాది నారుమడులు వేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఈ గ్రామంలోనే కాదు.. ఈ మండలంలో శివారు గ్రామాలైన వానపల్లిపాలెంతో పాటు ఎస్.కొత్తపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, కూనవరం, గోపవరం, చల్లపల్లిలో సుమారు 2 వేల ఎకరాల్లో వరి సాగును వదిలేస్తున్నారు.

గ్రౌండ్ రిపోర్ట్ — సాక్షి

మెరక.. ముంపు వీడక



ఆత్రేయపురం మండలం లొల్ల, మెర్లపాలెం వద్ద నీట మునిగిన వరి చేలు

ఆత్రేయపురం మండలంలో వరి పంట పొలాలు **కొద్దిపాటి వర్షానికే చెరువులు**గా మారిపోయాయి. మధ్య డెల్టా ముఖద్వారం వద్ద ఉండే వరి చేలు ఇవి. జిల్లాలో ఇది మెరక ప్రాంతం. అటువంటి చోట వర్షాలకు 350 ఎకరాల్లో చేలు మునిగిపోతే శివారుల్లో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కూటమి ప్రభుత్వం రూ.2.30 కోట్లతో అమలాపురం బ్యాంక్ కెనల్ దిగువన అండర్ టెర్నల్ (సైఫన్) నిర్మించింది. అయినా చేలు ముంపుబారిన పడడం గమనార్హం. మెర్లపాలెం, లొల్ల, వాడపాలెం రహదారిలో ముంపు సమస్య ఉంది.

ధైర్యం చేసే పరిస్థితి లేదు



మురుగునీటి కాలువల నుంచి ఉప్పునీరొచ్చేది. ఈసారి పంట కాలువల నుంచి ఉప్పు నీరొచ్చింది. ఉప్పునీరు రావడం వల్ల సాగు చేయలేని పరిస్థితి. సొంత భూములున్న వారు ఊడ్చేందుకు సిద్ధం కాగా, కౌలుకు చేసేవాళ్లు దూరమయ్యారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కౌలుదారులు ధైర్యం చేసి సాగు చేసే పరిస్థితి లేకుండా పోయింది.

– మహాదశ వెంకటేశ్వరరావు, కౌలురైతు, ఉప్పలగుప్తం మండలం

నాలుగేళ్లుగా నాట్లే లేవు



అల్లవరం మండలం మొగళ్లమూరులో సాగుకు పనికిరాని వరి చేలు

అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో సుమారు 70 ఎకరాల ఆయకట్టు ఉంది. బెండ కాలువ సాగునీరు రాకపోవడంతో పంచనది మురుగునీటి కాలువ నుంచి ఉప్పునీరు ఎగదన్ని పంట పొలాల్లోకి చేరుతుంది. దీనివల్ల నాలుగేళ్లుగా ఇక్కడ వరి నాట్లు వేయలేదు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు రైతులు పలుసార్లు ఫిర్యాదు చేసినా నేటికీ పరిష్కారం కాలేదు.

- ఇదే మండలం కొమరిగిరిపట్నంలో 50 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక్కడ ఐదేళ్లుగా ఖరీఫ్ లేదు. ఇటీవల కాలంలో రబీ కూడా ఉండడం లేదు. పంట పొలాల దిగువన ఉన్న ఆక్వా చెరువుల నుంచి ఉప్పునీరు ఎదురెక్కడంతో నాట్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు సాగు వదిలేశారు. ఇప్పుడు ఖరీఫ్ సాగు చేద్దామన్నా నారుమడులు, నాట్లు వేసే పరిస్థితి లేదు.

పంట.. వేసేది లేదంట



కాట్రేనికోనలో వరి చేల దుస్థితి

కాట్రేనికోన మండలంలో రైతులకు ఏటా తొలకరి సాగు చేయడం జూదంగా మారింది. విపత్తుల నుంచి తప్పించుకునేందుకు ముందస్తు సాగు చేద్దామన్నా ఈ ఏడాది సాగునీరు సకాలంలో విడుదల చేయలేదు. ఆలస్యంగానైనా సాగు మొదలు పెడదామనుకుంటే కూనవరం స్ట్రెయిట్ కట్ ద్వారా సముద్రం నీరు నేరుగా పంట చేలకు చేరడంతో భూములు చవుడు బారిపోతున్నాయి. దీంతో పంట వేసే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

కాలువల వ్యవస్థ... అవస్థ



సఖినేటిపల్లి మండలం గొందిలో వరి చేలు

ఆక్వా సాగు రాజోలు దీవిలో వరి సాగుకు ఉరివేస్తోంది. మురుగునీటి కాలువల వ్యవస్థ అధ్వానంగా ఉండడానికి తోడు ఆక్వా చెరువుల నుంచి వ్యర్థాలు కాలువల్లోకి తోడేస్తున్నారు. దీనివల్ల మురుగునీటి కాలువల్లో పూడిక పేరుకుపోయి చేల నుంచి ముంపునీరు దిగడం లేదు. అలాగే ఆక్వా చెరువుల నుంచి నీరు చేలల్లోకి వస్తుండడంతో రైతులు సాగు చేయలేని పరిస్థితి వచ్చింది. దీనివల్ల సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు మండలాల్లోని శివారు ప్రాంతాల్లో రైతులు తొలకరి సాగుకు దూరమయ్యారు. మురుగునీటి కాలువ వ్యవస్థ అధ్వానంగా ఉన్నంత కాలం సాగు చేయలేమని చెబుతున్నారు.

భూమున్న పేదోళ్లం అయ్యాం



కొమరగిరిపట్నంలో మూడు ఎకరాల్లో సాగు చేసేవాడిని. ఇప్పుడు భూమి ఉన్నా సాగుకు పనికి రాకుండా పోయాయి. మురుగునీరు దిగే అవకాశం లేక విలువైన భూములు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. మేమిప్పుడు భూమున్న పేదోళ్లం అయ్యాం.

– ఉండ్రాజవరపు యేసు, కొమరగిరిపట్నం, అల్లవరం మండలం

అన్నీ సమస్యలే..



తొలకరి పంటకు ఈ ఏడాది సాగునీరు ఆలస్యమైంది. చాలా మంది రైతులు సాగుకు దూరంగా ఉండనున్నారు. ఇదొక్కటే కాదు. అన్నీ సమస్యలే. ముంపు వెతలు, కూలీల కొరత వేధిస్తుంది. కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారే కాని, వ్యవసాయ పనులంటే ముందుకు రావడం లేదు. చాలా మంది రైతులు సాగు వదిలేయడానికి ఇదొక కారణం.

– వెత్రిబాబు, కాట్రేనికోన

ఆక్వా వ్యర్థాలన్నీ కలిసి..



మా చేలను చూస్తే నారు వేసే ధైర్యం రావడం లేదు. పంట, మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. రొయ్యల చెరువుల వల్ల ఉప్పునీరు చేరడంతో నాట్లు వేసినా దెబ్బతింటున్నాయి. తొలకరి పంటను రైతులంతా దాదాపు మర్చిపోయారు.

– దొడ్డా రాంబాబు, రైతు, గొంది, సఖినేటిపల్లి మండలం

అంతటా ఆధ్యాత్మిక పరవశం

- తొలి ఏకాదశి వేళ ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం



వాడపల్లిలో స్వామివారికి గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న పండితులు



అంతర్వేది ఆలయంలో క్యూలో వెళ్తున్న భక్తులు

కొత్తపేట: మది నిండా భక్తితో... వెంకన్న స్వామి నామస్మరణతో భక్తజనం మురిసింది. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం భక్తజనంతో కిక్కిరిసింది. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 4.30 గంటలకు స్వామివారి మూలమంత్ర సహిత ఐశ్వర్యలక్ష్మి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. మరోపక్క అష్టోత్తర పూజలు, కల్యాణోత్సవం జరిపారు. స్వామివారికి సాయంత్రం గరుడ వాహన, పల్లకీ సేవలు నిర్వహించారు. భక్తుల ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయం, ఆన్‌లైన్ ద్వారా దేవస్థానానికి రూ.14,17,965 ఆదాయం సమకూరిందని డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు.

అంతర్వేది.. భక్తుల పెన్నిధి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధికి తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భారీ క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. నిత్య అభిషేకం, సుదర్శన హోమ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సుమారు 6 వేల మందికి అన్నదాన పథకంలో భోజన వసతిని కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ ఒక్కరోజే రూ.4,13,719 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మామిడికుదురు శివాలయం నుంచి అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం వరకూ పాదయాత్ర చేశారు. గోవిందనామ స్మరణ చేస్తూ భక్తులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. 6,500 మంది స్వామిని దర్శించుకోగా, 4,200 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.4,79,852 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



నగరంలో పీర్ల ఊరేగింపులో ముస్లింలు

మామిడికుదురు: పవిత్ర కర్బలా పుణ్యభూమిలో అశువులు బాసిన హజరత్ ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి ముస్లింలు రక్తం చిందిస్తూ నివాళులర్పించారు. మొహర్రంలో భాగంగా ఆదివారం నగరంలో పీర్లు, గుమ్మటాలను ఊరేగించారు. హుస్సేన్ అని నినదిస్తూ బ్లేడులు, కత్తులు, గొలుసులతో శరీరాలను గాయపర్చుకుంటూ రక్తం చిందించారు. గుండెలు బాదుకుంటూ మాతం చేశారు. నగరం పంజా నుంచి పంజీషా వరకూ జరిగిన ఊరేగింపులో భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గుమ్మటాలను దర్శించుకున్నారు.

కలల తీరం చేరాలిలా..

- నేటి నుంచి ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్
- కాకినాడలో 2 హెల్ప్‌లైన్ కేంద్రాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న విద్యావేత్తలు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎంచుకున్న లక్ష్యం గొప్పదే కావచ్చు.. కానీ, ఆ లక్ష్యాన్ని చేరుకునే దారిపై కూడా అవగాహన ఉండాలి. ఆ ప్రయాణంలో సానుకూల అంశాలు.. అవరోధాల వంటి వాటిని ముందే తెలుసుకుంటే.. అడుగు ముందుకు ఎలా వేయాలో అర్థమవుతుంది. ఇంటర్మీడియెట్ పూర్తి చేసి.. ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకులు సాధించి.. ఇంజినీరింగ్ చదివి బంగారు భవిష్యత్తును అందుకోవాలనుకునే విద్యార్థులకు.. ఆ మార్గంలో తొలి అడుగు వేసే తరుణం వచ్చేసింది. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ విడుదల చేసింది. గత ఏడాది ఇంజినీరింగ్ కోర్సులకు అడ్మిషన్ షెడ్యూల్‌ను జూలై 1న ప్రారంభించగా ఈ ఏడాది వారం రోజులు ఆలస్యంగా విడుదల చేశారు. కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 23 నుంచి కళాశాలల్లో చేరాలి. దీంతో, ఇంజినీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లకు హడావుడి మొదలైంది. ఇప్పటికే ఏ కోర్సు చదవాలి, ఏ కళాశాలలో చేరాలి తదితర అంశాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు క్షుణ్ణంగా పరిశీలించుకున్నారు. కౌన్సెలింగ్‌లో తాము ఎంచుకున్న కళాశాలకు ఆప్షన్ ఇవ్వడంపై దాదాపు తుది నిర్ణయానికి వచ్చారు. వెబ్ ఆప్షన్ల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని విద్యానిపుణులు సూచిస్తున్నారు.

అందుబాటులోకి కొత్త కోర్సులు

ఇంజినీరింగ్‌లో ఈసీఈ, మెకానికల్, ఈఈఈ, సీఎస్ఈ, సివిల్ వంటి సంప్రదాయ కోర్సులతో పాటు కొత్తవి కూడా అందుబాటులోకి వచ్చాయి. సీఎస్ఈలో ఏఐ, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, వీఎల్ఎస్ఐ డిజైన్, అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఏరోస్పేస్, అగ్రికల్చరల్, మెరైన్, మైనింగ్, స్కిల్ అండ్ టెక్స్‌టైల్ వంటి కొత్త బ్రాంచ్‌లు వచ్చాయి.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా..

ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు cets.apsche.ap.gov.in&25 వెబ్‌సైట్‌లో అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ ఫామ్‌లోకి ప్రవేశించాలి. అక్కడ అడిగిన సమాచారం పూర్తిగా నింపి, సబ్‌మిట్ కొట్టాలి. పదో తరగతి, ఇంటర్మీడియెట్ మార్కుల జాబితాలు, 6 నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీతో పాటు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, రేషన్ కార్డులను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి గత ప్రభుత్వం 2022 నుంచి 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తోంది. అర్హత ఉన్న ప్రతి విద్యార్థీ దీనిని వినియోగించుకోవాలి.

ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు

కాకినాడ	6,343
కోనసీమ	2,868
తూర్పు గోదావరి	6,011
మొత్తం	15,222

స్వయంగా చూసుకోవడం మేలు



వెబ్ కౌన్సెలింగ్ సందర్భంగా రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, కళాశాల, కోర్సు ఎంపిక వంటివి ఎంపిక చేసుకునే సమయంలో ఎవరికి వారే స్వయంగా దగ్గరుండి చూసుకోవాలి. ఎవరైనా స్నేహితుల ద్వారానో మరొకరితోనే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ చేయిస్తే అనేక తప్పులు జరిగే అవకాశం ఉంటుంది. కొన్ని ప్రైవేటు కళాశాలల సిబ్బంది విద్యార్థి అభీష్టం మేరకు కళాశాల ఆప్షన్, కోర్సు వారే ఎంపిక చేస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థి అన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలి. మొదటి కౌన్సెలింగ్ దశ చాలా కీలకం. కాబట్టి విద్యార్థులు తమ ర్యాంకును బట్టి మంచి కళాశాలను ఎంపిక చేసుకుని అడ్మిషన్ పొందాలి. వెబ్ కౌన్సెలింగ్ విద్యార్థి స్వీయ పర్యవేక్షణలో జరుగుతుంది కాబట్టి అతనే పూర్తి బాధ్యుడు అవుతాడు.

– ఎస్.రామకృష్ణయ్య, సీఎస్ఈ ప్రొఫెసర్, జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల

ఆసక్తి ఉన్న బ్రాంచ్‌నే ఎంచుకోవాలి



విద్యార్థులు కళాశాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌నే ఎంచుకుని, అందులో ప్రతిభ చూపాలి. ముఖ్యంగా ఒకే కోర్సుకు డిమాండ్ అనే భావన నుంచి బయట పడి, ఏ కోర్సుకు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.. భవిష్యత్తులో వాటికి ఉన్న డిమాండ్ తదితర అంశాలపై విద్యావేత్తల అభిప్రాయాలు తెలుసుకుకోవాలి. అందుకు తగిన బ్రాంచ్ ఎంచుకోవాలి. ఒకే కోర్సులో అందరూ చేరడం ఏమాత్రం సరి కాదు. ఇటీవల సాఫ్ట్‌వేర్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తద్వారా సీఎస్ఈ కోర్సు ఒక్కటే ప్రాధాన్యమున్నది కాదనేది గుర్తించాలి. అభివృద్ధి అనేది కేవలం ఒక్క రంగంతోనే సాధ్యపడదు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు కావలసిన అన్ని పత్రాలూ సరి చూసుకోవాలి.

– డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, మెకానికల్ ప్రొఫెసర్, జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాల

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో..

మొత్తం ఇంజినీరింగ్ కళాశాలలు	34
ప్రభుత్వ	2
వీటిల్లో సీట్లు	750
ప్రైవేటు	32
వీటిల్లో సీట్లు	16,500
మొత్తం సీట్లు	17,250

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- సోమవారం నుంచి 16వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు.
- సోమవారం నుంచి 17వ తేదీ వరకూ ఆన్‌లైన్ సర్టిఫికెట్ల పరిశీలన.
- ఈ నెల 13 నుంచి 18 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు.
- 19న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం.
- ఈ నెల 22న సీట్ల కేటాయింపు.
- ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకూ కళాశాలలో అడ్మిషన్లు.
- ఆగస్టు 4 నుంచి తరగతులు ప్రారంభం.

హెల్ప్‌లైన్ కేంద్రాలు : జేఎన్‌టీయూ–కాకినాడ ఇంజిజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బ్లాక్, ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల (జగన్నాథపురం)

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

లాలిస్తూ.. బుజ్జగిస్తూ..


వ్యాక్సిన్ వేయించేందుకు పెంపుడు కుక్కను తీసుకు వస్తున్న యువతులు

పెంచిన బంధం పెనవేసుకుంది.. పెంపుడు జంతువులంటే ఎనలేని ప్రేమ కనిపించింది.. లాలిస్తూ, బుజ్జగిస్తూ వాటికి యజమానులు టీకాలు వేయించారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఆదివారం రాజమహేంద్రవరం ఏరియా పశు వైద్యశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇక్కడ తమ పెంపుడు శునకాలు, పిల్లులు, కోళ్లకు యజమానులు దగ్గరుండి మరీ టీకాలు వేయించారు. అలాగే ఇక్కడకు పాములను సైతం తీసుకురావడం గమనార్హం. శునకాలను అల్లారు ముద్దుగా చూసుకున్నారు. అవి సైతం యజమానులపై ఎంతో ప్రేమ చూపుతూ.. విధేయతతో మెలిగాయి.


పిల్లిని ఎత్తుకుని..

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)/ సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం


అల్లారు ముద్దుగా సాకుతూ..


వ్యాక్సిన్ పొడిచే 'సారే...'


నేను చెప్పినట్టు వినాల్సిందే..


ముగ్గురు మొనగాళ్లం..


దాహం వేస్తోందా: మంచినీరు తాగు..


బాల పైథాన్ పాము

భజే విఘ్ననాయకా..


విఘ్నేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామి ఆలయం తొలి ఏకాదశి పర్వదినం, ఆదివారం సందర్భంగా రద్దీగా మారింది. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ జరిపారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 119 మంది, స్వామి పంచామృతాభిషేకాల్లో ఇద్దరు దంపతులు పాల్గొన్నారు. లక్ష్మీ గణపతి హోమంలో 37 జంటలు, స్వామివారికి 17 మంది భక్తులు ఉండ్రాళ్ల పూజ, ఏడుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం, పది మంది చిన్నారులకు తులాభారం నిర్వహించారు. 29 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 3,689 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఆలయానికి రూ.4,49,089 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

క్లుప్తంగా

వైద్యుల నిర్లక్ష్యంతో బిడ్డ చనిపోయాడని ఆందోళన


టి.కొత్తపల్లి సీహెచ్‌సీ వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎస్సై రవీంద్రబాబు

ఐ.పోలవరం: వైద్యుల నిర్లక్ష్యంతో తమ బిడ్డను కోల్పోయామని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెదమడి గ్రామానికి చెందిన గర్భిణి ధరణికి పురిటి నొప్పులు రావడంతో శనివారం టి.కొత్తపల్లి సీహెచ్‌సీలో చేర్పించారు. ఆదివారం ఉదయం ఆమెకు వైద్యులు ఆపరేషన్ చేయగా, పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సాయంత్రం బిడ్డకు అనారోగ్యంగా ఉందని బంధువులు గుర్తించడంతో బిడ్డ పరిస్థితిపై వైద్యులను నిలదీశారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ బిడ్డకు మెరుగైన వైద్యం చేయించాలని సూచించగా, అమలాపురం కిమ్స్‌కు తీసుకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. మార్గ మధ్యంలో శిశువు మృతి చెందడంతో స్థానిక వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు చనిపోయినట్లు, తమకు న్యాయం చేయాలని జనం ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఎస్సై రవీంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళకారులతో చర్చలు జరిపారు. దీనిపై విచారణ జరిపి తగు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

కాకినాడ రూరల్: కాకినాడ జీజీహెచ్‌లో గుర్తుతెలియని వృద్ధుడు (75) మృతి చెందాడు. గత నెల 30న మధ్యాహ్నం కాకినాడ ఆర్టీఓ ఆఫీసు రోడ్డులో కోటయ్య కన్వెన్షన్ వద్ద మాటలేకుండా పడిపోయి ఉండడంతో స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడిని గుర్తిస్తే సర్పవరం పోలీసు స్టేషన్ నంబర్ 0884 2379284, సెల్ నంబర్ 94407 96554కు సమాచారం ఇవ్వాలని సీఐ పెద్దిరాజు కోరారు.

వెజిట్రబుల్స్

- వంటింట్లో ధరల మంట
- పంట దిగుబడి తగ్గడమే కారణం
- వినియోగదారులపై పెను భారం


మడికిలోని అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్


రావులపాలెం రైతుబజార్‌లో కూరగాయల దుకాణం

ఆలమూరు: ఏం కొంటాం.. ఏం తింటాం.. అనేట్టుంది కూరగాయల పరిస్థితి. వీటి ధర అంతకంతకూ పెరుగుతోంది. ఉల్లిని కొంటేనే కన్నీరు వస్తోంది. పచ్చిమిర్చికి ఘాటు ఎక్కువైంది. వాతావరణ మార్పులు, దిగుబడి తగ్గడంతో కూరగాయల ధర రోజురోజుకూ పెరిగిపోతుంది., బహిరంగ మార్కెట్‌లో ఇప్పటి వరకూ సరైన ధర లేక ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ధరలు పెరుగుతున్నా దిగుబడి లేక దిగాలు చెందుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో గత నెలతో పోలిస్తే ఈ వారంలో కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. గోదావరిలో వరద ఉధృతి పెరిగినా, వర్షాలు కురిసినా ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ నిలకడగా ఉన్న నాణ్యమైన ఉల్లి ధర బహిరంగ మార్కెట్‌లో రూ.40కు చేరుకుంది. ఈ ఏడాది ప్రథమార్థంలో వరుసగా ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగు పూర్తి స్థాయిలో చేపట్టకపోవడం వల్ల దిగుబడి క్రమేపీ తగ్గిపోయినందువల్లే ప్రస్తుత ధరల పెరుగుదలకు కారణమైందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

కూరగాయలు	గతం కిలో రూ. ధర	ప్రస్తుతం
ఉల్లి	25	50
పచ్చిమిర్చి	20	70
అల్లం	70	120
బంగాళదుంప	20	35
వంకాయలు	20	60
బెండకాయలు	20	50
బీట్‌రూట్	30	50
క్యాబేజీ	20	50
చిక్కుడు	80	120
అరటికాయ	05	10
కాలీఫ్లవర్	25	50
దొండకాయలు	25	40
టమోటా	25	60
బీరకాయ	30	60
గోరుచిక్కుళ్లు	25	40
ఆనబకాయ	10	20
కాకరకాయ	25	60
కంద దుంప	40	60
పెండలం దుంప	35	50
బీన్స్	60	80
కొత్తిమీర	70	150
క్యాప్సికం	40	60
ఆకాకర	70	120

పంట తుది దశకు చేరుకోవడంతో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలోని చాగల్నాడు, మెట్ట, లంక పరివాహక ప్రాంతాల్లో సుమారు 38 వేల ఎకరాల్లో కూరగాయల సాగు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ఆరు నెలల నుంచి కూరగాయల దిగుబడి ఆశాజనకంగా ఉంది. దీంతో ఉద్యాన రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్, మే నెలల్లో టమోటా, కొత్తిమీర, వంకాయ, దొండకాయ ధరలు కిలో రూ.పదికి పడిపోవడం పరిస్థితికి అద్దం పడుతుంది. అయితే కూరగాయల సాగు ప్రస్తుతం తుది దశకు చేరుకోవడంతో దిగుబడులు తగ్గిపోతుండటంతో డిమాండ్ పెరిగి, ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఇదే క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోని మడికి, రావులపాలెం, అమలాపురం, పిఠాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర హోల్‌సేల్ మార్కెట్‌లకు గత వారం రోజుల నుంచి దిగుమతులు గణనీయంగా తగ్గిపోవడం ధరల పెరుగుదలకు కారణమవుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

వరద పెరిగినా.. వర్షం పడినా..

గోదావరికి ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో వరదల వచ్చే అవకాశం ఉంది. దీంతో లంకల్లో సాగు చేసే పంట పూర్తిగా తగ్గిపోతుంది. అదే క్రమంలో వర్షాలతో మెట్ట, చాగల్నాడు ప్రాంతాల్లోని పంట దిగుబడి అరకొరగా ఉండే అవకాశం ఉంది. దీంతో కూరగాయలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితులు ఉత్పన్నమైతే ధర మరింత పెరిగే అవకాశం ఉంది. లంక పరివాహక ప్రాంత రైతులు మళ్లీ వరదలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన అక్టోబర్ నెల తరువాత గాని కూరగాయల సాగు చేపట్టే అవకాశం లేదు. దిగుబడి కోసం మరో మూడు నెలల వేచి ఉండాలి. దీంతో పెరుగుతున్న కూరగాయల ధరలు రాబోయే సంక్రాంతి వరకూ ఆకాశానికి ఎగబాకి ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పటి వరకూ కిలో రూ.10 నుంచి రూ.20 వరకూ పలికిన పలు కూరగాయల ధరలు ప్రస్తుతం రూ.50కి దాటాయి. అలాగే చిక్కుళ్లు, ఆకాకర, అల్లం ధరలు కిలో రూ.100కు పైగా వరకూ విక్రయిస్తున్నారు. కొత్తిమీర సాగు పూర్తి కావడంతో బెంగళూరు నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల కిలో రూ.150 పలుకుతుంది. దీంతో తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర తదితర ఆకుకూరలకు డిమాండ్ పెరగడంతో, వాటి ధరలు పెరుగుతున్నాయి.

కొనుగోలు చేయలేకపోతున్నాం..



పెరిగిన ధరలతో కూరగాయలను కొనుగోలు చేయలేకపోతున్నాం. వర్షాలతో కూరగాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతుండటం ఆందోళన కలిగిస్తుంది. అలాగే రైతు బజార్లలో కూడా అన్ని కూరగాయలు అందుబాటులో ఉండటం లేదు.

– కె.నాగమణి, గృహిణి, పెదపళ్ల

ఒక్కసారిగా పెరగడంతో...



కూరగాయల దిగుబడి తగ్గడంతో ధరల పెరుగుదలకు కారణమైంది. ఇప్పటి వరకూ బహిరంగ మార్కెట్‌లో స్థిరంగా ఉన్న ధరలు ఒక్కసారిగా పెరుగుపోతుండడంతో ఆ ప్రభావం రిటైల్ వ్యాపారంపై పడింది. పెరుగుతున్న ధరలతో కూరగాయల వ్యాపారం లాభసాటిగా ఉండటం లేదు.

– చిన్నం రాజు, రిటైల్ కూరగాయల వ్యాపారి, ఆలమూరు

సరకు కొరత ఏర్పడింది



లంక, మెట్ట, చాగల్నాడు ప్రాంతాల్లో కూరగాయల దిగుబడి ఒకేసారి తగ్గిపోవడంతో ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇదే క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుందామనుకున్నా సరకు కొరత ఏర్పడింది. దీంతో డిమాండ్‌కు సరఫరాలో భారీ వ్యత్యాసం ఉండడంతో కూరగాయల ధరల పెరుగుదలకు కారణమైంది.

– చెల్లుబోయిన సింహాచలం, హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి, మడికి

కామనగరువులో అగ్ని ప్రమాదం


ప్రమాదంలో కాలిపోతున్న ఇళ్లు

అమలాపురం రూరల్: కామనగరువు గ్రామ పరిధి జంగంపాలెంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. తొలిత వాసంశెట్టి మంగ తాయారు ఇంటి నుంచి రేగిన నిప్పు రవ్వల కారణంగా దొంగ నాగలక్ష్మి, కుంచే వెంకటేశ్వరరావు, కుంచే శాంతమ్మ కుటుంబాలకు చెందిన తాటాకిళ్లు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక అధికారి ఎం.రాజా ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో వివిధ ధ్రువీకరణ పత్రాలు, వడ్రంగికి సంబంధించిన ఫర్నీచర్, నగదు, 30 కొబ్బరి చెట్లు, వివిధ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.6 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ దంపతులు సహాయ చర్యల్లో పాల్గొన్నారు. బాధితులకు ప్రభుత్వపరంగా బియ్యం, పంచదార అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. రేగుపాలెం – నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (50) పట్టాలు దాటుతుండగా, రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తెలుపు చొక్కా, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తుని మార్చురీలో భద్రపరిచారు. వివరాలకు 94906 19020 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

చిన్న దుకాణానికి మెగా విద్యుత్ బిల్లు



మలికిపురంలోని ఓ వస్త్ర దుకాణానికి రూ.లక్షల్లో వచ్చిన బిల్లు

మలికిపురం: ఓ చిన్న సైజు వస్త్ర దుకాణానికి మెగా విద్యుత్ బిల్లు రావడంతో ఆ యజమాని అవాక్కయ్యారు. ఈ మాయాజాలమేమిటో అర్థం కాక సతమతమవుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం గ్రామానికి చెందిన కుంపట్ల యువకుమార్ స్థానిక సెంటర్‌లో ఓ కొట్టు అద్దెకు తీసుకుని చిన్నపాటి వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ దుకాణానికి ప్రతి నెలా రూ.500 నుంచి రూ.800 మధ్య కరెంటు బిల్లు వచ్చేది. అయితే, జూన్ నెలకు సంబంధించి భవన యజమాని రామారావు పేరిట తన దుకాణానికి ఏకంగా రూ.3,38,496 బిల్లు వచ్చిందని యువకుమార్ ఆదివారం తెలిపారు. తన దుకాణంలో స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నేరుగా తన మొబైల్ నంబరుకు బిల్లు వస్తోందని, ఇప్పుడు పెద్ద మొత్తంలో బిల్లు రావడంతో కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేశానని ఆయన పేర్కొన్నారు.

పిచ్చికుక్కల స్వైరవిహారం

- 19 మందికి గాయాలు
- అమలాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు


వీధి కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక

కాట్రేనికోన/ అమలాపురం టౌన్: పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి.. కనిపించిన వారిపై దాడికి దిగాయి.. ఈ ఘటనలు అమలాపురం, కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో జరిగాయి. బాధితుల కథనం ప్రకారం.. ఆదివారం పల్లం గ్రామంలో పిచ్చికుక్క దాడి చేయడంతో సుమారు 18 మంది గాయపడ్డారు. అక్కడ చేపల మార్కెట్ జరుగుతున్న సమయంలో మహిళలతో పాటు అధిక సంఖ్యలో వ్యాపారులు ఉండటంతో బెంబేలెత్తిపోయారు. బాధితులకు కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యురాలు నీలిమ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అలాగే అమలాపురం కంసానికాలనీలో అదే ప్రాంతానికి చెందిన కుంచే శాన్విశ్రీ (9)పై వీధి కుక్క దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. ఆ బాలికతో పాటు మరో వ్యక్తిని ఆ కుక్క కరిచింది. ఈ బాధితులిద్దరూ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. శాన్విశ్రీ కాళ్లు, నడుం, చేతులపై కుక్క కరవడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన


తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను అభినందిస్తున్న అతిథులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తాడిపత్రిలో ఇటీవల జరిగిన జాతీయ, రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం ఆదివారం కాకినాడ శ్రీనగర్ మున్సిపల్ స్కూల్‌లో జరిగింది. దీనికి డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమానికి జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి, కోచ్ బి.అర్జునరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో 11వ సారి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు సాధించారన్నారు. హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 12 పతకాలు సాధించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. తైక్వాండో కోచ్ అర్జునరావు మాట్లాడుతూ స్టేట్ మీట్‌లో 38 బంగారు, 12 రజత, 17 కాంస్య పతకాలు తూర్పు క్రీడాకారులు కైవసం చేసుకున్నారని తెలిపారు. జీజీహెచ్ వైద్యులు ప్రవీణ, అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, తులసి, రత్నం, అఖిల, కేవీ సత్యనారాయణ, తేజ, అరుణ, ప్రసన్న పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- గోప్యంగా ఉంచిన నిర్వాహకులు


మల్లేపల్లిలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

గండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకంలో పర్యవేక్షణ పక్కదారి పడుతోంది. రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయడంలో అలసత్వం ఆవరిస్తుంది. మధ్యాహ్న భోజన పథకంలో వండిన కూరలో బల్లి అవశేషాలు ఉండడం, అది విద్యార్థుల కంచాల్లో వేశారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారని తల్లిదండ్రులు, గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఘటన మల్లేపల్లి జెడ్పీ స్కూల్‌లో జరిగింది. ఇక్కడ సుబ్బాయమ్మపేట, ఉప్పలపాడు, మల్లేపల్లి గ్రామాలకు చెందిన సుమారు 400 మంది చదువుతున్నారు. గత నెల 23న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వండిన కూరలో బల్లి పడిన విషయాన్ని గుర్తించిన విద్యార్థులు ఉపాధ్యాయులు, నిర్వాహకులకు తెలియజేశారు. దీంతో ఆ కూరను ఉపయోగించకుండా మరో కూరను వండి వడ్డించినట్టు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే అప్పటికే విద్యార్థులకు అన్నం, కూర వడ్డించిన కంచాల్లో బల్లి అవశేషాలు కనిపించడంతో తినకుండా నిలుపుదల చేసినప్పటికీ కొందరు రెండు, మూడు ముద్దలు తిన్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఉడకని అన్నం, పప్పు, నీళ్లను తలపించే విధంగా సాంబారును వడ్డిస్తున్నారని, తమకు పెట్టాల్సిన కోడిగుడ్లను పెట్టడం లేదని వాపోతున్నారు. భోజనంలో నాణ్యత లేక ఇంటి నుంచే తెచ్చుకుంటున్నామని మరికొందరు విద్యార్థులు చెబుతున్నారు. బల్లి పడిన కూరను తింటే పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై స్కూల్ హెచ్‌ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లగా బల్లి పడిన వెంటనే తీయించేశామని చెప్పారు.